క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



బాధితుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న గ్రామ పెద్దలు

కాళ్ల: బాస్విని చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని పలువురు పెద్దలు అన్నారు. దొడ్డనపూడిలో పొనమాడి సాయిబాబు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు స్పందించి బాస్విని చారిటబుల్ ట్రస్టు తరుపున ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న, వయస్సు పైబడిన సుమారు 35 మంది పేదలకు తన ట్రస్టు తరుపున ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ప్రతినెలా అందిస్తున్నామన్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించటంతో పాటు పేద ప్రజలకు ఎన్నో సేవలందిస్తున్న సర్పంచ్ సుబ్బారావును అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నక్కా వీరకృష్ణ, కొల్లి సురేష్, పలువురు వార్డు సభ్యులు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకుల జోరు



కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి చల్లని మబ్బులతో వాతావరణం అహ్లాదకరంగా ఉండటంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సెదతీరారు. పర్యాటకుల రాకతో బీచ్ రోడ్డు కిటకిటలాడింది. సముద్ర స్నానం అనంతరం పర్యాటకులు తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

సిద్ధాంతంలో గోదావరి వరద తగ్గుముఖం



సిద్ధాంతంలో నిలకడగా ఉన్న వశిష్టా గోదావరి ఉధృతి

పెనుగొండ: గోదావరి పరవళ్ల ఉధృతి తగ్గుముఖం పట్టింది. సిద్ధాంతం వద్ద వశిష్టాగోదావరి నెమ్మదిగా తగ్గుతుంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రానికి శనివారం నాటికన్నా రెండు అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. దీంతో మధ్యస్థ లంకలోకి రాకపోకలు యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఆచంట మండలంలో పెదమల్లం, అయోధ్యలంక, భీమలాపురం వద్ద ఉధృతి నెమ్మదిగా ఉండడంతో లంక గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. పడవల రాకపోకలు సాగుతున్నాయి. గోదావరిలో వరద ఉధృతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

కనకాయలంకలో డీఎంహెచ్ఓ పర్యటన



కనకాయలంకలో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు, డాక్టర్ జాన్‌లియో

యలమంచిలి: వరద ముంపునకు గురైన కనకాయలంక గ్రామంలో ఆదివారం డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు పర్యటించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను, అందుబాటులో ఉంచిన మందులను తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న జ్వరం సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు గోదావరి వరద కారణంగా ప్రజలు ఎవరూ రోగాల బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సంపూర్ణ పారిశుద్ధ్య చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఒకవేళ ఎవరైన రోగాలబారిన పడినా వైద్య సహాయం చేసేందుకు కనకాయలంకలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు మూడు షిఫ్టలలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. పాము కాటుకు, కుక్క కాటుకు అవసరమైన ఇంజక్షన్లుతోపాటు, అన్ని రకాల మందులు, ఇతర ఇంజక్షన్లు, క్లోరిన్ మాత్రలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దొడ్డిపట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ జాన్‌లియో మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణులకు, బాలింతలకు, చంటి పిల్లలకు సిబ్బందిని నిత్యం అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఫీవర్ సర్వే చేసి జ్వర లక్షణాలు ఉన్న వారికి అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు.

ఇంటింటికీ వెళ్లి సమస్యలు పరిష్కరించండి

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపు



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని జీవీఆర్ కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2019 ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలలో 98 శాతానికి పైగా హామీలను ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం జరిగిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అదే మాదిరిగా భీమవరం నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ఎన్నికలలో ఇచ్చిన హామీలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత దేశంలో సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. నవరత్న పథకాలతో అరులైన ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని అన్నారు. అయితే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రజలకు మేలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కాగా ఇటీవల రాజమండ్రిలో జరిగిన మహానాడులో చంద్రబాబు నెరవేరని హామీలను మరోసారి ప్రకటించి ప్రజలను మోసం చేసేందుకు బస్సుయాత్రలను చేపట్టడం జరిగిందని విమర్శించారు. 2014 ఎన్నికలలో చంద్రబాబు 600కి పైగానే హామీలను ఇచ్చి ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, ఫలితంగా 2019 ఎన్నికలలో ప్రజలు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పి 23 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో పేదలకు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని, ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేశారని, రుణమాఫీ పేరుతో డ్వాక్రా మహిళలను, రైతులను మోసం చేశారని, ఉద్యోగాలు పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన ఇటువంటి చంద్రబాబుతో పవన్ కల్యాణ్ జతకట్టి రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రజల్లోకి వస్తున్న నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కుట్రలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జేసీఎస్ కన్వీనర్లు మానుకొండ ప్రదీప్, చెల్ల బోయిన సూర్య ప్రకాష్, నల్లం రాంబాబు, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, కోమటి రాంబాబు, జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సభాపతి, మావుళ్ళమ్మ దేవస్థానం పాలకమండలి చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, కొట్టి కుటుంబరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

25న ఉండిలో జగనన్న సురక్ష

ఉండి: ఉండి–2, 3 సచివాలయాల్లో ఈ నెల 25వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవీ అప్పారావు తెలిపారు. ఆయా సచివాలయాల వద్ద ఉదయం 9:30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆయా సచివాలయ పరిధిలోని ప్రజలు తెలియపరచిన వివిధ అంశాల వారీగా కావలసిన ధ్రువపత్రాలను ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

ఏబీవీపీ సమావేశం

సాక్షి, భీమవరం: ఏబీవీపీ నియోజకవర్గ మహిళా కార్యకర్తల సమావేశం ఆదివారం చినఅమిరంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో నిర్వహించారు. జూలై 28న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త జూనియర్ కళాశాలల బంద్ పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. తొలుత బాల గంగాధర తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కన్వీనర్ కాయిత డిన్ను, చందు, భీమవరం మహిళా కన్వీనర్ డి చాందిని, మహిళా కో–కన్వీనర్ ఎం గీత, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్య సేవలు భేష్

ఆకివీడు సీహెచ్‌సీని పరిశీలించిన కేరళ వైద్య బృందం



ఆకివీడు సీహెచ్‌సీలో వైద్య సేవలపై బాలింతను అడిగి తెలుసుకుంటున్న కేరళ వైద్య బృందం

ఆకివీడు: సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు బాగున్నాయని కేరళ వైద్యం బృందం ప్రతినిధి ఓమెన్ మాథ్యూస్ కితాబిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగంలో ఆరోగ్య పథకాల అమలు పరిశీలనలో భాగంగా ఆదివారం పీఆర్సీ (పాపులేషన్ రిసోర్స్ సెంటర్ బృందం) స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, నిర్వహణ, రికార్డులను కేరళ వైద్యం బృందం పరిశీలించింది. జనాభాకు సరిపడే విధంగా సీహెచ్‌సీకి అవసరమయ్యే వసతుల్ని సమకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పిస్తామని మథ్యూస్ చెప్పారు. అనంతరం సీహెచ్‌సీలో అమలు జేస్తున్న జేఎస్‌వై, ఏఎస్ఎస్‌కే, పీఎంఎస్ఎంఏ, హిమ్స్, సీడీ, ఎన్‌సీడీ, కంటి వెలుగు, వైఎస్సార్ క్లినిక్స్, హెచ్ డబ్ల్యూసీ పనితీరు, సిజేరియన్, ట్యూబెక్టమీ, నవజాత శిశువుల పర్యవేక్షణ, ఫార్మసీ, ల్యాబొరేటరీ, డెంటల్ విభాగాల్ని పరిశీలించారు. ఓపీ, మందుల వినియోగాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న బాలింతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్‌లకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం, వైద్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీబీ కార్యక్రమం, బాలింతలకు సొమ్ము చెల్లింపు, జనన, మరణాల రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, పోస్టుమార్టం స్థానికంగానే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగితో పాటు సహాయ వ్యక్తికి భోజన వసతి కల్పించేందుకు త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా గణాంక అధికారి ఎమ్మెస్ ప్రసాద్, స్థానిక ఓహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంత్ కుమార్, డాక్టర్ సుగుణరాజు, పీవీ భాస్కరరావు, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమార్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన బ్రోచర్ల ఆవిష్కరణ



ఓటు హక్కు నమోదు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటు హక్కు నమోదుపై పట్టణంలో స్వచ్ఛంద సంస్థలు రెవెన్యూ శాఖ సహకారంతో అవగాహన ప్రచార కార్యక్రమాల కోసం ముద్రించిన బ్రోచర్లను ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ శ్రీనాథ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఇటువంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఒక వజ్రాయుధం అని, నిర్లక్ష్యరాసుల్లో అవగాహన లేక ఓటును నమోదు చేసుకోలేకపోతున్నారని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడుతుందన్నారు. కొన్ని కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను భారత ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం ప్రాంతంలోని స్లమ్ ఏరియాలో పల్లె గ్రామాల్లో కూడా అవగాహన ప్రచార కార్యక్రమాలను రెవెన్యూ శాఖ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రచార కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, సీఐ కృష్ణకుమార్, ఎస్సై అప్పారావు పాల్గొన్నారు.

మార్కెటింగ్ కల్పించాలి

పెనుగొండ: చేనేత కార్మికులకు ప్రతి నియోజకవర్గంలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు అల్లాడి సూర్య భాస్కర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆచంట వేమవరంలో చేనేత కార్మికుల సమస్యలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వస్తున్న, రావాల్సిన సబ్సిడీలు, ఉచిత కరెంటు, నేతన్న నేస్తంలపై ఆరా తీశారు. చేనేతలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, చేనేత యువతకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలన్నారు. నేరుగా వస్త్రాలు విక్రయించుకోవడం వల్ల ఉపాధి మెరుగుపడి ఆత్మహత్యలు నివారించగలుగుతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల కుమారస్వామి,–ార్మికులు పాల్గొన్నారు.

బిషప్ శ్యామ్‌సన్‌కు సత్కారం



చెరుకుమిల్లిలో బిషప్ శ్యామ్‌సన్‌ను సత్కరించిన దృశ్యం

ఆకివీడు: ప్రేమతత్వాన్ని పలువురికి పంచడమే బైబిల్ సారాంశమని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, బైబిల్ మిషన్ చైర్మన్ మేడిది జాన్‌సన్ అన్నారు. చెరుకుమిల్లిలోని సీఎస్ఐ చర్చిలో బిషప్ ఎరిచర్ల శ్యామ్‌సన్ సత్కార సభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాన్‌సన్ మాట్లాడుతూ తల్లిదండ్రులపై ఎనలేని ప్రేమ చూపాలన్నారు. సమాజంలో అందరూ దేవుని బిడ్డలేనన్నారు. బైబిల్ సన్మార్గం చూపుతుందన్నారు. బిషప్ శ్యామ్‌సన్ చిన్నప్పటి జ్ఞాపకాల్ని జాన్‌సన్ సభకు తెలియజేశారు. సన్మాన గ్రహీత బిషప్ శ్యామ్‌సన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మనుషుల్ని సన్మార్గం వైపు మళ్లిస్తాడన్నారు. సీఎస్ఐ కౌన్సిల్ సభ్యుడు ఎరిచర్ల సాంబర్లిన్ ఆధ్వర్యంలో బిషప్ శ్యామ్‌సన్, మేడిది జాన్‌సన్‌లను ఘనంగా సత్కరించారు. స్త్రీల సంఘం, సంఘ పెద్దలు, యువకులు దుశ్శాలువాలతో వారిని సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి ప్రకాశం, పాస్టర్ జయపూర్ణ, సంఘ పెద్దలు ఎరిచర్ల పుష్పరాజ్, ప్రసాద్, స్థానికులు ఎరిచర్ల గ్లాడ్‌సన్, బిరుదుగడ్డ రమేష్, జానీ తదితరులు పాల్గొన్నారు. పలువురు దాతల సహకారంతో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

మావుళ్లమ్మకు పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నందుపు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. రూ.5 లక్షలను అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ, ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ఆలయ ధర్మకర్త రామాయణం సత్యనారాయణకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజాది కార్యక్రమములు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

నేడు స్పందన

ఉండి: ఉండిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు చెప్పారు. మండలంలోని 19 గ్రామాల ప్రజలు తమ సమస్యలపై స్పందన కార్యక్రమంలో అర్జీలు అందించవచ్చునని ఆయన తెలిపారు.

'మణిపూర్' బాధ్యులను ఉరి తీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు సొడదాసి గంగయ్య

కాళ్ల: మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడంతో పాటు అత్యాచారం చేసిన కామాంధులను ఉరితీయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బహుజన సమైఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు సొడదాసి గంగయ్య డిమాండ్ చేశారు. సీసలి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బహుజన సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు నెలల నుంచి మహిళలపై హింసలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. మే 5న అక్కడ కొంతమంది యువకులు ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి వీధుల వెంబడి నడిపించి అత్యాచారం చేసినా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఘటనకు బాధ్యులైన కామాంధులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మైలా శ్రీనివాస్, నాయకులు మత్తే రాజ్ కుమార్, విజయరాజు, రాము, శ్రీధర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇన్నర్ వీల్' పట్టణ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఇన్నర్ వీల్ క్లబ్ కార్యవర్గం

సాక్షి, భీమవరం: ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 302 చైర్‌పర్సన్‌గా పట్టణానికి చెందిన గంధం శ్రీదేవి నియమితులయ్యారు. అంతర్జాతీయ ఇన్నర్ వీల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో భీమవరం ఇన్నర్ వీల్ క్లబ్, భీమవరం బ్లోసమ్స్ నిర్వహణలో స్థానికంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలికా విద్యకు ప్రోత్సాహం అందిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేసి, వృద్ధుల సంక్షేమానికి పాటుపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌గా నియమితులైన గంధం శ్రీదేవిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. క్లబ్ ప్రెసిడెంట్ చీడే అమ్మాజీ, వైస్ చైర్‌పర్సన్‌గా లక్ష్మి శ్రీనివాస్, ఈఎస్ఓగా అరుణశ్రీ, సెక్రటరీగా డాక్టర్ ఆరేటి రాణి, ట్రెజరర్‌గా డి.సావిత్రి, ఐఎస్ఓగా సౌందర్య, ఎడిటర్‌గా రాధిక బాధ్యతలు స్వీకరించారు. ప్రమీల విజయబాబు, బుద్ధవరపు కనకదుర్గ తో పాటు 15 మంది పీడీసీలు పాల్గొన్నారు.

సొంతింటి కల.. నెరవేరిన వేళ

- జగనన్న కాలనీల్లో చురుగ్గా ఇళ్ల నిర్మాణం
- 14 గ్రామాల్లో 2,080 మందికి ఇళ్లపట్టాలు
- కాలనీల్లో మెరుగుపడుతున్న వసతులు



మొగల్లులో జగనన్న కాలనీలో జోరుగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు



నిర్మాణంలో ఉన్న ఇల్లు

పాలకోడేరు: పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కల చాలా మందికి కలగానే మిగిలిపోయింది. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు ఇస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అనంతరం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల కలను సాకారం చేసే దిశగా కార్యాచరణ చేపట్టారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. మండలంలోని 14 గ్రామాల్లో 16 లేఅవుట్లు ఏర్పాటు చేసి వాటిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్లాట్లు వేశారు. వాటిని 2,080 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 336 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 342 ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక రెండో ఫేజ్‌లో 10 లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరలో చేపడతారు.

ఇంటి నిర్మాణానికి సాయం

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా లబ్ధిదారులకు రూ.1.80 లక్షలను ప్రభుత్వం అందజేస్తోంది. ఈ నగదును బేస్‌మెంట్, రూఫ్ లెవల్, శ్లాబ్, నిర్మాణం పూర్తయ్యాక వివిధ దశల్లో అందజేస్తుంది. ఈ నగదు నేరుగా లబ్ధిదారు బ్యాంకు ఖాతాల్లో జమవుతోంది. అలాగే సొంత స్థలమున్న వారికీ ఈ పథకం వర్తింపజేస్తున్నారు. 1.50 సెంట్లు ఉన్న వారు అర్హులు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహనిర్మాణశాఖ ఈ అవకాశం కల్పించింది.

అద్దె కట్టలేక ఇబ్బంది పడ్డాం



సొంతిల్లు లేకపోవడంతో అద్దె కట్టుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రతి నెలా రూ.2,500 నుంచి రూ.3 వేలు వరకు అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడేది. మండల కేంద్రాల్లో ఈ అద్దెల భారం మరీ ఎక్కువగా ఉండేది. సొంతింటి కల నేరవేరడం ఆనందంగా ఉంది.

– దుదే సుజాత, లబ్ధిదారురాలు, మొగల్లు

జగనన్న మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం. ప్రభుత్వం చొరవతో సొంతిల్లు నిర్మించుకున్నాం. త్వరలో గృహ ప్రవేశం చేసుకుంటాం. గ్రామంలో నాకు 1.50 సెంట్ల స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు అందించారు.

– కొండేటి మరియమ్మ లబ్ధిదారులు, కుముదవల్లి

జోరుగా ఇళ్ల నిర్మాణం

మండలంలోని 16 లేఅవుట్లలో 2,080 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీటిలో 336 గృహాలు పూర్తయ్యాయి. 342 నిర్మాణ దశల్లో ఉన్నాయి. 1,029లో కొన్ని బేస్మెంట్ దశలో మరికొన్ని మొదలుపెట్టాల్సి ఉంది. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఫేజ్–2 లేఅవుట్ 10కి సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేశాం.

– బీవీ నరసింహారావు, హౌసింగ్ ఏఈ, పాలకోడేరు